క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

స్టేషన్‌ఘన్‌పూర్/జనగామ రూరల్: జనగామలోని ఏబీవీ, ఘన్‌పూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025–26 విద్యాసంవత్సరానికి గాను అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాహత్‌ఖానం ఒక ప్రకటనలో తెలిపారు. కామర్స్, పొలిటికల్ సైన్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్, ఎకనామిక్స్, ఇంగ్లిష్, హిస్టరీ, తెలుగు సబ్జెక్టుల్లో ఒక్కొక్క పోస్టు ఖాళీగా ఉందని తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు సంబంధిత పీజీ కోర్సులలో 55 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణులై ఉండాలని, ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం సరిపోతుందన్నారు. పీహెచ్‌డీ, ఎన్‌ఈటీ, ఎస్‌ఈటీ ఉన్నవారికి మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు. అర్హత, ఆసక్తి ఉన్నవారు ఈనెల 24వ తేదీ సాయంత్రం 4 గంటల లోగా జనగామ ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈనెల 25న ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు.

24న వ్యాసరచన పోటీలు

జనగామ రూరల్: మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం వర్ధంతిని పురస్కరించుకుని జిల్లాలోని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు లీడ్ గ్లోబల్ ఫౌండేషన్ సమన్వయకర్త డాక్టర్ పరికిపండ్ల అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏకశిల ఐ.టీ.ఐ కళాశాలలో ఈనెల 24వ తేదీన ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు పోటీలు నిర్వహించబడుతాయన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదివే 8వ తరగతి విద్యార్థులు మాత్రమే పోటీలకు హాజరుకావాలన్నారు. 'నివాసయోగ్యమైన భూగోళ పరిరక్షణ' అనే అంశంపై వ్యాసరచన పోటీ ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా సమన్వయకర్త డాక్టర్ పిట్ల సత్యం 9885950310 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఇంటర్‌లో స్పాట్ అడ్మిషన్లు

తరిగొప్పుల: మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్మీడియట్ ఫార్మా టెక్నాలజీ గ్రూపులో ప్రవేశాల కొరకు నేడు (సోమవారం) స్పాట్ అడ్మిషన్లు చేపట్టడం జరుగుతుందని పాఠశాల ప్రత్యేక అధికారి సునీత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇతర సమాచారం కోసం 9346704232 ఫోన్ నంబర్‌లో సంప్రదించవలసిందిగా ఆమె పేర్కొన్నారు.

ఆత్మగౌరవం కోసమే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా


సుభాషిణి దంపతులు

దేవరుప్పుల: ప్రజాపాలనలో ప్రజల కోసమే మరింత సేవచేయాలనే తలంపుతో చేరితే ఆత్మగౌరవానికి భంగం కలుగుతున్న తరుణంలో కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసినట్టు గొల్లపల్లి మాజీ సర్పంచ్ కోనేటి సుభాషిణి, నర్సయ్య దంపతులు పేర్కొన్నారు. ఆదివారం విలేకరులతో వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో గ్రామాభివృద్ధికి పాలుపడిన తాము ప్రస్తుత ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, పార్టీ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి నాయకత్వంలో మరింత అభివృద్ధి చేయాలనీ కాంగ్రెస్ చేరామన్నారు. ఐతే గ్రామంలో రెండేళ్ల నుండి ఇప్పటి వరకు గ్రామ కమిటీలు వేయకపోవడంతో పార్టీలో సమన్వయ లోపం ఏర్పడి గ్రూపులుగా విడిపోయి తమలాంటి వారిని అవమాన పరుస్తున్నారని, కొత్తగా వచ్చిన వారిని పార్టీ లో కలుపుకొని వాతావరణం కొరవడడంతో తాము రాజీనామా చేస్తున్నట్లు వివరించారు.

ఎల్లమ్మతల్లికి పూజలు

జనగామ రూరల్: వానలు కురవాలని జేకేఎస్ ఫెర్టిలైజర్ షాప్ ఆధ్వర్యంలో ఆదివారం యశ్వంతాపూర్‌లోని ఎల్లమ్మ తల్లికి బోనం సమర్పించి పూజలు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు పాడిపంటలు, సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. పజ్జూరి కిషోర్, గొరిగె సంతోష్, మోటె మధు, మోకు రామ్ రెడ్డి, ఎటుకుల భాస్కర్, బూడిద దర్శన్ కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాలు సీజ్

బచ్చన్నపేట: మండల కేంద్రం తాళ్ల చెరువు నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న వాహనాలను ఆదివారం పోలీసులు సీజ్ చేసి కేసున మోదు చేశారు. ఎస్సై ఎస్‌కే అబ్దుల్ హమీద్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎలాంటి అనుమతులు లేకుండా చెరువు మట్టిని తరలిస్తున్న ప్రొక్లెయినర్, ఐదు ట్రాక్టర్లను సీజ్ చేసి యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఎన్నిక


సమ్మయ్య


సతీష్‌గౌడ్

జనగామ: రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని కామాక్షి ఫంక్షన్ హాలులో టీడీపీ పట్టణ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొత్తపల్లి సమ్మయ్య, ఉపాధ్యక్షులుగా ఆకుల దుర్గాప్రసాద్, సురుగు సతీష్‌గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ పట్టణంలో తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం తీసుకువస్తానన్నారు.

టీజీబీ ఖాతాదారులకు ఇబ్బందులు

- ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల చెల్లింపునకు పనిచేయని టీజీబీ అకౌంట్
- పట్టణాలకు వెళ్లి ఇతర బ్యాంకుల్లో అకౌంట్లు తీస్తున్న లబ్ధిదారులు


బేస్‌మెంట్ వరకు పూర్తయిన ఇందిరమ్మ ఇల్లు

లింగాలఘణపురం: ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల చెల్లింపుకు తెలంగాణ గ్రామీణ బ్యాంకు (టీజీబీ) అకౌంట్ పనిచేయడంలేదు. దీంతో గ్రామీణ ప్రాంత లబ్ధిదారులు తిప్పలు పడుతున్నారు. పట్టణాలకు వెళ్లి ఇతర బ్యాంకుల్లో అకౌంట్లు తీయాల్సిన పరిస్థితి నెలకొంది. అకౌంట్ తీసేందుకు ఒక్కొక్క బ్యాంకులో ఒక్కో రకంగా లబ్ధిదారులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు బేస్‌మెట్ వరకు పూర్తయిన వాటికి రూ.లక్ష చెల్లించేందుకు హౌసింగ్ అధికారులు ఆన్‌లైన్‌లో టీజీబీ బ్యాంకు అకౌంట్ నంబర్‌ను నమోదు చేయగానే అన్‌అవేలబుల్ అనే ఆప్షన్ రావడంతో అధికారులు మరో బ్యాంకు అకౌంట్ కావాలంటూ లబ్ధిదారులకు చెబుతున్నారు. దీంతో లబ్ధిదారులు పట్టణాల్లోని ఇతర బ్యాంకులకు వెళ్లి కొత్తగా అకౌంట్లు తీసి ఇస్తున్నారు. లింగాలఘణపురం మండల పరిధిలోని 22 పంచాయితీల్లో ఐదు గ్రామాలు లింగాలఘణపురం, బండ్లగూడెం, గుమ్మడవెల్లి, జీడికల్, సిరిపురం గ్రామాలు తెలంగాణ గ్రామీణ బ్యాంక్ పరిధిలో ఉన్నాయి. ఈ గ్రామాల ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రానికి చెందిన నలుగురు లబ్ధిదారులు రఫీయా, గ్యాదరి జ్యోతి, గ్యాదరి రేణుక, బోయిని లాస్యలు బేస్‌మెంట్ వరకు పూర్తి చేయగా అధికారులు ఆన్‌లైన్‌లో బిల్లులు చెల్లించేందుకు నమోదు చేయగా అన్‌అవేలబుల్ అని రావడంతో ఇతర బ్యాంకుల్లో అకౌంట్ కావాలంటూ అధికారులు చెప్పడంతో లబ్ధిదారులు ఇతర బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ విషయంపై హౌసింగ్ ఏఈ దివ్యను ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నించగా కొద్ది రోజులుగా ఫోన్ ఎత్తడంలేదు. బ్యాంకు మేనేజర్ సృజనాదేవిని వివరణ కోరగా సమస్య ఏంటో హౌసింగ్ అధికారులు తమ దృష్టికి తీసుకరాలేదని, వస్తే పరిష్కరించేందుకు ఉన్నతాధికారులతో మాట్లాడుతామని చెప్పారు.

ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులో అకౌంట్ తీశా..



మండల కేంద్రంలోని టీజీబీ బ్యాంకు అకౌంట్ ఇస్తే పని చేయడంలేదని చెప్పడంతో జనగామకు వెళ్లి ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌లో రూ.1,000లతో అకౌంట్ తీశా. మా ఊరి బ్యాంకులో బిల్లులు వస్తే ఇబ్బంది ఉండదు. జనగామకు వెళ్లి మరో బ్యాంకులో తీసుకోవాలంటే కొంచెం కష్టంగా ఉంది. లోకల్ బ్యాంకులో బిల్లులు పడే విధంగా చూడాలి.

\- రఫియా, లింగాలఘణపురం

రాష్ట్ర వ్యాప్తంగా టీజీబీతో సమస్యలు

ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు ఆన్‌లైన్‌లో లబ్ధిదారుల పేరుతో ఉన్న కోడ్‌తో నమోదు చేయడం జరుగుతుంది. ఇందులో టీజీబీ బ్యాంక్ అకౌంట్లన్నీ నాట్ ఆక్సెప్ట్ అని వస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే సమస్య ఉంది. బ్యాంకు అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా సమీపంలో అందుబాటులో ఉన్న మరో బ్యాంకు ఖాతా నంబర్ ఇవ్వాలని సూచిస్తున్నాం.

\- మాత్యనాయక్, పీడీ, హౌసింగ్

ఘనంగా వన భోజనాలు


అమ్మవారి గుడివద్ద మొక్కులు చెల్లిస్తున్న భక్తులు


బచ్చన్నపేట: వన భోజనాల్లో గ్రామస్తులు

స్టేషన్‌ఘన్‌పూర్: స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శివునిపల్లిలో వివిధ కులాలకు చెందిన ప్రజలు ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని ఆదివారం వనభోజనాలకు తరలివెళ్లారు. ముందుగా గ్రామానికి చెందిన పలువురు శివునిపల్లి శివారులో ఉన్న అమ్మవారి గుడి వద్ద మొక్కులు చెల్లించుకున్నారు. అందరూ ఆరోగ్యంగా, సుఖసంతోషాలతో ఉండాలని, వర్షాలు సకాలంలో కురిసి పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ ప్రత్యేక పూజలు చేపట్టారు.

బచ్చన్నపేటలో..

బచ్చన్నపేట: మండలకేంద్రంలోని దళితులు వన భోజనాలకు వెళ్లారు. ఈ సందర్భంగా గ్రామ దేవతలకు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

పెండింగ్ ఎక్స్‌గ్రేషియా విడుదల చేయాలి


టీపీసీసీ చీఫ్‌కు వినతిపత్రం అందజేస్తున్న విక్రంగౌడ్

కొడకండ్ల: గీత కార్మికుల కుటుంబాలకు ఇవ్వాల్సిన పెండింగ్ ఎక్స్‌గ్రేషియాను వెంటనే విడుదల చేయించాలని టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ను గౌడ సంఘం రాష్ట్ర నాయకుడు బొమ్మగాని విక్రంగౌడ్ కలిసి వినతి పత్రం అందించారు. ఆదివారం గాంధీభవన్‌లో టీపీసీసీ చీఫ్‌ను ఆయన కలిసి రాష్ట్ర వ్యాప్తంగా తాటి చెట్టు పైనుంచి పడి మృతి చెందడంతో పాటు శాశ్వత అంగవైకల్యం, గాయపడినటువంటి 710 మంది గీత కార్మికుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా పెండింగ్‌లో ఉందని, ప్రభుత్వం ద్వారా వెంటనే విడుదల చేయించాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు విక్రంగౌడ్ తెలిపారు. గౌడ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్, అరవింద్, యాదగిరిగౌడ్‌లు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


నివాళులర్పిస్తున్న దయాకర్‌రావు

పాలకుర్తి: బీఆర్ఎస్ పాలకుర్తి గ్రామ అధ్యక్షుడు కడుదుల కర్ణాకర్‌రెడ్డి తల్లి మల్లమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. కాగా, ఆదివారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు గ్రామానికి చేరుకుని మల్లమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. అలాగే బీఆర్ఎస్ నాయకుడు సలేంద్ర శంకర్‌రావు తండ్రి సుదర్శన్ అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, మాజీ ఎంపీపీ నాగిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాసరావు, నాయకులు ఉన్నారు.

బీఆర్ఎస్ పూర్వ వైభవం కోసం పాటుపడండి

దేవరుప్పుల: తెలంగాణ సాధనతోపాటు ఆత్మగౌరవం సంపాందించి పెట్టిన బీఆర్ఎస్ పూర్వవైభవం కోసం యువత పాటుపడాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సూచించారు. ఆదివారం బోనాల పర్వదినం పురస్కరించుకుని హైదరాబాద్‌లో మాజీ మంత్రి ఎర్రబెల్లిని యువజన నాయకులు కంచర్ల హరీష్, ఓడపెల్లి వెంకటేష్ ఆధ్వర్యంలో కామారెడ్డిగూడేనికి చెందిన యువజన నాయకులు కలిశారు. చింత రవి, చింత పరశురాములు, మరాఠీ వినయ్, నరేష్ యాదవ్, పాల్గొన్నారు.

హరితహారం


మొక్క నాటుతున్న చంద్రశేఖర్ దంపతులు

జనగామ: జిల్లా డైనమిక్ లయన్ లీడర్ 320 ఎఫ్ జిల్లా గవర్నర్ డాక్టర్ చంద్రశేఖర్ ఆర్య, జిలా ఫస్ట్ లయన్ లేడీ డాక్టర్ రాజేశ్వరి ఓర్లాండో (యూఎస్ఏ)లో జిల్లా గవర్నర్‌గా ప్రమాణస్వీకారం చేసి ఆదివారం స్వదేశానికి విచ్చేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహం ఎదుట హరితహారం నిర్వహించి మొక్కలు నాటారు. రీజియన్ చైర్మన్లు రామిని శ్రీనివాస్, చంద్రగిరి శ్రీనివాస్, లయన్ సుధాకర్‌రెడ్డి, హరికిషన్‌రెడ్డి, కృష్ణజీవన్ బజాజ్, కుర్రెముల యాదగిరి, రేనుకుంట ప్రకాశం, రఘునాథ్ రెడ్డి, ప్రమోద్, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

నోట్‌బుక్స్ పంపిణీ

స్టేషన్‌ఘన్‌పూర్: చంద్రశేఖర్ స్వదేశానికి విచ్చేసిన సందర్భంగా ఘన్‌పూర్ శివారులోని ఇందిరానగర్ కాలనీలో స్థానిక లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన సమక్షంలో శివునిపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరెలు, పేద విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శివునిపల్లి లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు గౌరిశెట్టి అనీల్, వినయ్, అనీల్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ జెండా ఎగురవేయాలి


నినాదాలు చేస్తున్న నాయకులు

జనగామ రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు సమష్టిగా కృషి చేసి బీఆర్ఎస్ జెండా ఎగురవేయాలని మండలం కోఆర్డినేటర్ ఇర్రి రమణారెడ్డి, చిటకోడూర్ గ్రామ కోఆర్డినేటర్ గుర్రం నాగరాజు అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు చీటకోడూర్ గ్రామంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. గత బీఆర్ఎస్ హయాంలో రైతులకు నీటి ఎద్దడి లేదని.. వేసవి కాలంలో కూడా చెరువులు అలుగు పోశాయన్నారు. నేడు సాగు నీటికి రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సమావేశంలో ఎనగందల కృష్ణ, బిట్ల శంకర్, కొండా మల్లికార్జున్, ఒంటేరు శ్రీనివాస్‌రెడ్డి, సిహెచ్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో వసతుల కల్పన


పూర్వవిద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

జనగామ: విద్యాబుద్ధులు నేర్పిన బడికి మేమున్నామంటూ పూర్వ విద్యార్థులు వసతులు కల్పించారు. బీరప్పగడ్డ ఏరియాలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్‌లో చదువుకున్న 1999–2000 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు వాటర్ ప్యూరిఫయర్, ప్రింటర్, ప్రొజెక్టర్, 10 బెంచీలు, యాక్టివిటీస్ పరికరాలు సుమారు రూ.లక్ష విలువ చేసే మెటీరియల్‌ను ఆదివారం అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులను పాఠశాల యాజమాన్యం, హెచ్ ఎం బాల నర్సయ్య, ప్రబంధ కారులు జైన రమేష్, బుస్సా సిద్దేశ్వర్, ఆచార్యు లు కొత్తపల్లి స్వప్న, కృష్ణవేణి, అర్చన, శ్వేత, శిరీష తదితరులను ఘనంగా సన్మానించారు.

జీపీకి సీసీ కెమెరాల అందజేత


కార్యదర్శికి సీసీ కెమెరాలు అందజేస్తున్న ప్రసాద్

కొడకండ్ల: మండలకేంద్రంలోని గ్రామ పంచాయతీకి జీలేష్ సోలార్ పవర్ ప్లాంట్ గ్రీన్‌కో తరపున రూ.80 వేల విలువ చేసే 15 సీసీ కెమెరాలు, కేబుల్‌ను సంస్థ మేనేజర్ వాకా ప్రసాద్ పంచాయతీ కార్యదర్శి మహేష్‌కు ఆదివారం అందజేశారు. గ్రామ పర్యవేక్షణ కోసం గ్రీన్‌కో ఫౌండేషన్ పక్షాన అందించడం జరిగిందని మేనేజర్ తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ఉద్యోగులు బోయిని నరేష్, మురళీ, దామోదర్, సంగం, శ్రీనివాస్, భానుచందర్, అఖిల్, శివాజీ, హరితేజ పాల్గొన్నారు.

'ఇందిరమ్మ పాలన రేవంత్‌కే సాధ్యం'


లబ్ధిదారులతో కిరణ్‌కుమార్ తదితరులు

నర్మెట: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి ఇందిరమ్మ పాలన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోనే సాధ్యమని రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్ అన్నారు. స్థానిక కేఎస్ఆర్ గార్డెన్స్‌లో ఆదివారం నర్మెట, తరిగొప్పుల, బచ్చన్నపేట, మద్దూర్, దూల్మిట్ట మండలాల లబ్ధిదారులు 16 మందికి రూ.7 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను పార్టీ శేణులతో కలిసి ఆయన పంపిణీ చేశారు. శ్రీధర్, మహేందర్ రెడ్డి, మల్లేష్, వెంకట్, గుజ్జుల మధు, రమణారెడ్డి, చెవుల పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల నెరవేరుతోంది

బచ్చన్నపేట: కాంగ్రెస్ హయాంలోనే పేదల సొంతింటి కల నెరవేరుతోందని ఆ పార్టీ పలు గ్రామాల అధ్యక్షులు మల్లం శ్రీనివాస్, బాల్నె రమేష్, శ్రీధర్ రెడ్డి అన్నారు. ఆదివారం కొడ్వటూర్, కేసిరెడ్డిపల్లి, బండనాగారం, బసిరెడ్డిపల్లి, లక్ష్మాపూర్‌లలో వారు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముగ్గుపోసి భూమిపూజ చేశారు.

ప్రజా సమస్యలపై ఇంటింటా సర్వే


సర్వే నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు


జఫర్‌గఢ్: మండలంలోని కోనాయిచలం, రేగడితండా, సాగరం, తమ్మడపల్లి (ఐ), తిమ్మంపేట, లక్ష్మీనాయక్‌తండా, రఘునాథ్‌పల్లి గ్రామాల్లో ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఇంటింటా సర్వేను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నాగేష్‌గౌడ్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. తాటి సురేష్‌గౌడ్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు అబ్బరబోయిన యాకస్వామి తదితరులు పాల్గొన్నారు.

చర్య తీసుకోవాలి

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఇప్పగూడెం గ్రామంలోని సర్వేనంబర్ 872/2/7 లోని మూడు ఎకరాల ప్రభుత్వ భూమిని గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మాజీ సర్పంచ్ రాజకీయ పలుకుబడితో కబ్జా చేస్తున్నాడని సీపీఎం మండల నాయకుడు వారాల రాజు ఆరోపించారు. ఈ విషయమై గ్రామంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇప్పగూడెం గ్రామ రెవెన్యూ పరిధిలో 872 సర్వేనంబర్‌లో 31 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంటుందని, సదరు భూమిలో మూడు ఎకరాలను, గుట్టను కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ సర్పంచ్ అక్రమంగా పట్టా చేయించుకున్నాడని విమర్శించారు. సదరు గుట్టను జేసీబీలతో తవ్వి ఆక్రమించుకున్నాడని తెలిపారు. ఈ విషయమై ఇప్పటికే స్థానిక రెవెన్యూ అధికారులకు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. రెవెన్యూ అధికారులు రేపు, మాపు అంటూ కాలయాపన చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా తక్షణమే స్పందించి ఇష్టారాజ్యంగా తన పేరిట, కుటుంబ సభ్యుల పేరిట పట్టాలు చేసుకుని అక్రమంగా భూకబ్జా చేస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో గ్రామస్తులతో కలిసి ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు.

కొంగుబంగారం లక్ష్మీనర్సింహస్వామి

- 25 నుంచి నెల రోజుల పాటు కొనసాగనున్న ఉత్సవాలు
- అధిక సంఖ్యలో తరలిరానున్న భక్తులు


వేల్పుగొండ కొండపై వెలసిన లక్ష్మీనర్సింహస్వామి ఆలయం


లక్ష్మీనర్సింహస్వామి


కోనేరు

జఫర్‌గఢ్: భక్తుల కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా మండల కేంద్రంలోని వేల్పుగొండ లక్ష్మీనర్సింహస్వామి ఆలయం నిలుస్తోంది. ఆలయంలో ఈనెల 25వ తేదీ నుంచి స్వామివారి జాతర మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. నెల రోజుల పాటు జరగనున్న ఉత్సవాలకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరానుండడంతో ఆలయన నిర్వాహకులు ముందుగానే అన్ని ఏర్పాట్లు చేశారు. ఎన్నో ఏళ్ల నుంచి స్వామి వారిని భక్తులు తమ ఇలవేల్పుగా కొలుస్తున్నారు. ఎతైన కొండపై వెలసిన స్వామివారిని దర్శించుకోవాలంటే భక్తులు కాలినడకనే వెళ్లాల్సి ఉంటుంది. ఇదే కొండపై రెండు కొనేరులు ఉన్నాయి. సహజ సిద్ధంగా ఏర్పడిన కొనేరులు ఒకటి స్వామి వారి ఆలయం ఎదుట ఉండగా మరొకటి కొద్ది దూరంలో ఉంది. ఆలయం ఎదుట ఉన్న కొనేరులో భక్తులు స్నానాలు చేసి స్వామి వారిని దర్శించుకుంటారు. భక్తులు కాలినడక గోవింద నామస్మరణతో కొండపైకి చేరుకుని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరిస్తారు. తిరిగి కొండ దిగువ ఉన్న శ్రీసీతారామచంద్రస్వామి ఆలయాన్ని కూడా దర్శించుకుంటారు. జాతర సందర్భంగా ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు ఉంటాయని ఆలయ అర్చకుడు పాడిశెట్టి వెంకటాచార్యులు తెలిపారు. ఈ నెల 25 నుంచి ప్రారంభయ్యే ఉత్సవాలు ఆగస్టు 23వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. కొండపైకి వచ్చే భక్తుల కోసం ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు.

ఆర్థికసాయం



కొడకండ్ల: ప్రమాదావశాత్తు గాయపడిన గంట్లకుంట గ్రామానికి చెందిన చెరుకు శ్రీనివాస్‌కు కొడకండ్ల బెస్ట్ ఫ్రెండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో రూ. 10 వేల సాయం అందజేశారు. ఆదివారం శ్రీనివాస్‌ను పరామర్శించి తమవంతుగా సాయం అందించినట్లు సొసైటీ అధ్యక్షుడు ప్రసన్నకుమార్ తెలిపారు. ఉపాధ్యక్షుడు అక్బర్, సహాయ కార్యదర్శి ఎరుకలి రాజు, మేడ్దుల అశోక్, అరుణ్‌గోపాల్, సోమేశ్వర్, కుమారస్వామి, నిర్మల తదితరులు ఉన్నారు.

చరిత్రాత్మక నిర్ణయం

నర్మెట: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడం చరిత్రాత్మకమని, సీఎం రేవంత్‌రెడ్డి సాహసోపేత నిర్ణయం చరిత్రలో నిలిచిపోతుందని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్ కుమార్ అన్నారు. ఈసందర్భంగా ఆదివారం నర్మెట చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం సీఎం, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి చిత్రపటాలకు పార్టీ శ్రేణులతో కలిసి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ ప్రతినిధులు, జిల్లా, మండల నాయకులు ప్రజ్ఞాపురం శ్రీధర్, యసర్ల అంజయ్య, కూకట్ల చంద్రమౌళి, బూస అంజయ్య, గొట్టె రాజశేఖర్, కాల్వ అశోక్, చెవుల పరశురాములు పాల్గొన్నారు.

దేవయ్య సేవలు మరువలేనివి


దేవయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రస్తుత స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధి మండలంలోని శివునిపల్లి మాజీ సర్పంచ్ గుర్రం దేవయ్య సర్పంచ్‌గా గ్రామానికి చేసిన సేవలు మరువలేనివని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు బూర్ల శంకర్‌ముదిరాజ్, మున్నూరుకాపు సంఘం రాష్ట్ర నాయకుడు పోశాల కృష్ణమూర్తిపటేల్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకుడు వాంకుడోత్ దశరథ్‌నాయక్ అన్నారు. ఇటీవల దేవయ్య ప్రమాదవశాత్తు గాయపడి హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతిచెందగా బాధిత కుటుంబాన్ని వారు ఆదివారం పరామర్శించారు. దేవయ్య చిత్రపటం వద్ద పూలు చల్లి నివాళులర్పించి ప్రగాఢ సంతాపం తెలిపారు. నాయకులు వేముగంటి రాంప్రసాద్, మొగుడుంపురం కిషోర్‌కుమార్, కోతి రాములు, ఆరెళ్ళి అశోక్, నీల రాములు, నీరటి ప్రభాకర్, మామిడాల శ్రీనివాస్, గుర్రం శ్రీనివాస్, చింత దానయ్య, గాండ్ల సతీష్ ,రాజు, సురేష్ ఉన్నారు.

మత్స్యకారులకు గొడుగుల పంపిణీ


గొడుగులు పంపిణీ చేస్తున్న క్లబ్ ప్రతినిధులు

జనగామ రూరల్: చందుపట్ల జయలత రవీందర్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఆదివారం సూర్యక్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేశారు. పట్టణంలో మత్స్యకారులకు గొడుగుల పంపిణీ చేశారు. అలాగే మార్కండేయ స్వామి ఆలయ ఆవరణలో మొక్కలు నాటారు. మధుమేహ వ్యాధిగ్రస్తులకు డాక్టర్లు పూర్ణచందర్, సత్యం ఆధ్వర్యంలో వైద్య పరీక్ష నిర్వహించారు. అధ్యక్షుడు భోగారం దయాకర్ కార్యదర్శి ఎనగందుల లక్ష్మీనారాయణ, గాడి పెల్లి కిషోర్ కుమార్, కేశవరెడ్డి కాశి పాల్గొన్నారు.